క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం



రాంబిల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

రాంబిల్లి : రాంబిల్లిలో సోమవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అచ్యుతాపురంలో నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సభకు మండలం నుంచి 5వేల మందిని తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనుబాబు, డి.ఎస్.ఎన్ రాజు(బుజ్జి), కె.నర్సింగరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న జగతా శ్రీనివాస్

పాయకరావుపేట : ఏఐసీసీ ఉపనేత రాహుల్ గాంధీ 53 వ పుట్టినరోజు సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెసు పార్టీ పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద రాహుల్ గాంధీ జన్మదిన కేక్‌ను కట్ చేసారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు పార్టీ నక్కపల్లి, కోటవురట్ల మండలాల నాయకులు మోర్త సింహాచలం, నడింప నూకరాజు, ప్రగడ చక్రరావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు స్టాపర్లు



కనోస్సా స్కూల్ వద్ద స్టాపర్లు ఏర్పాటు చేస్తున్న పోలీసు, హైవే సిబ్బంది

పాయకరావుపేట : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా స్టాపర్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాల్లోను, సమీపాన గల తాండవ జంక్షన్, కనోస్సా పాఠశాల వద్ద, శ్రీ ప్రకాష్ జంక్షన్ , పీఎల్ పురం జంక్షన్ , నామవరం జంక్షన్ వద్ద రోడ్డుకిరువైపులా స్థానిక పోలీసు సిబ్బంది, హైవే మొబైల్ సిబ్బంది కలిసి ఆయా ప్రాంతాల్లో స్టాపర్లు ఏర్పాటు చేసినట్టు సీఐ తెలిపారు.

ఎంఈవో-2 రజనీదేవి బాధ్యతల స్వీకారం



రజనీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండల ఎంఈవో-2గా రజనీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో-1 దేవరాయలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఇఓ-2 రజనీదేవికి మండల విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

దుప్పితూరులో గడప గడపకు నేడు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పితూరు గ్రామంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 6 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన సూచించారు.

దర్జీ కుటుంబానికి చేయూత

మునగపాక : అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందిన దర్జీ కాదులూరి గోవిందరావు కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం సోమవారం అందించారు. తోటాడకు చెందిన గోవిందరావు దర్జీ వృత్తి చేసుకుంటూ కుటుంబ పోషణ సాగించేవారు. ఇటీవల ఆయన మృతి చెందారు. సోమవారం వీరభద్ర టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోవిందరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి భర్త నాగప్పారావు రూ.3వేలు, టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి రూ.2వేలు వెరసి రూ.5వేల సాయాన్ని గోవిందరావు కుటుంబ సభ్యులకు అందజేశారు.

జగన్నాథ రథయాత్రకు వేళాయె

- జగన్నాథస్వామి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- మునగపాక, నాగులాపల్లిలో ఘనంగా ఉత్సవాల నిర్వహణ
- భక్తి శ్రద్ధలతో పెళ్లిరాట

మునగపాక : మండలంలో జగన్నాథస్వామి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా జగన్నాథుని ఉత్సవాలను క్రమం తప్పకుండా గ్రామస్తుల సహకారంతో ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాలను ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం నందీశ్వర ప్రాంగణం జగన్నాథస్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ రథయాత్ర గ్రామంలో అన్ని వీధులగుండా సాగుతుందన్నారు. అనంతరం బైపాస్ రోడ్డులో ఉన్న ఆలయంలో విగ్రహాలను భక్తుల దర్శనం కోసం అందుబాటులో ఉంచుతామన్నారు. 29వ తేదీన ఉత్సవ ముగింపు కార్యక్రమం జరుగుతుంది. దీనిలో భాగంగా సోమవారం జగన్నాథుని కల్యాణ



సుభద్రా సమేత జగన్నాథస్వామి

రాట ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కాండ్రేగుల జగ్గప్పారావు, పెద్దలు జగన్నాథం, వెంకటప్పారావు, జగ్గప్పారావు, ఎం.ఎం. నాయుడు పాల్గొన్నారు.

పూరీ జగన్నాథునికి 9 రకాల నైవేద్యాలు సమర్పణ

జగన్నాథస్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగపాక, తిమ్మరాజుపేటకు చెందిన పలువురు భక్తులు 9 రకాల నైవేద్యాలతో జగన్నాథుడికి సమర్పించేందుకు పూరీ వెళ్లారు. తిమ్మరాజుపేటకు చెందిన వికాస తరంగిణి కన్వీనర్ సరిసా శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు భక్తులు పూరీలోని జగ



మునగపాకలో జగన్నాథుని పెళ్లిరాట



పూరిలోని జగన్నాథునికి సమర్పించేందుకు నైవేద్యాలతో వెళుతున్న మునగపాక మండల భక్తులు

న్నాథుడి రథయాత్రకు పయనమయ్యారు. 9 రకాల నైవేద్యాలను జగన్నాథుడికి సమర్పించేందుకు డప్పు వాయిద్యాల నడుమ పయనమై స్వామికి మొక్కులు చెల్లించారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని, ఈ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవలసిన అవసరం ఉందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. జల్లూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఓ పక్క చిరు జల్లులు స్వాగతం పలకగా చల్లటి వాతావరణంలో వర్షాన్ని లెక్క చేయక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కార్యక్రమం కొనసాగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతటి సంక్షేమం గతంలో ఎపుడైనా చూశారా? అని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ ఆశీస్సులు అందించాలని, మళ్లీ ఆయనే సీఎం కావాలన్నారు. బూటకపు హామీలతో బురిడీ కొట్టించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని,



జల్లూరులో వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎన్నికలు ఎపుడు వచ్చినా చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నవరత్నాలు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతున్నాయన్నారు. కుల వృత్తులు, చిరు వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, మహిళలు ఇలా అందరి బాగోగుల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. 6వ వార్డులో సీసీ రోడ్డు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. గ్రామానికి కేటాయించే రూ.10 లక్షలలో కొన్ని నిధులతో సీసీ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, రెండో వైస్ ఎంపీపీ చక్కా సుజాత, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, కిల్లాడ శ్రీనివాసరావు, నారాయణమూర్తి, పారుపల్లి శ్రీను, విజయ్‌కుమార్, శింగంపల్లి కిషోర్, సన్యాసినాయుడు, ఎస్.వి.రమణమూర్తి, గొల్లు చిట్టిబాబు, పైల నాని, కన్నబాబు, సర్పంచులు శివరామ్, కోసూరు అప్పారావు, వరహాల బాబు, ఎంపీటీసీ రాంబాబు, ఏవో చంద్రశేఖర్, డీటీ సోమశేఖర్, ఎస్ఐ నారాయణరావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనాలకు స్థల పరిశీలన

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నక్కపల్లిలో మంజూరు చేసిన డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. మూడేళ్ల నుంచి నక్కపల్లి జూనియర్ కళాశాలలో డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎమ్మెల్యే బాబూరావుతో పాటు,స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు కూడా పంపించారు. దీంతో ప్రభుత్వం కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని ఉన్నత విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. సోమవారం ఎంపీపీ రత్నం తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ తదితరులు వారపు సంత వెనుక ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఐదెకరాల స్థలంలో పొక్లెయిన్ సాయంతో చదును చేశారు. జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఈ స్థలంలో కళాశాల భవనాలు నిర్మించేందుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యే బాబూరావుకు నివేదిక సమర్పిస్తామని ఎంపీపీ, వైస్ ఎంపీపీ తెలిపారు.



వారపు సంత వద్ద చదును చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు

ఆలయ భూముల లీజుకు వేలం పాట



కట్టుబోలులో లీజు వేలం పాట

రాంబిల్లి : కట్టుబోలు గ్రామంలో సోమవారం కైలాశేశ్వరస్వామి ఆలయ భూముల లీజు వేలం పాట ఈవో సాంబశివరావు నిర్వహించారు. ఆరు ఎకరాల భూమిని మూడేళ్ల కాల పరిమితికి లీజుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించారు. ఏడాదికి రూ.60 వేలకు జి.మంగ పాడారు. గతసారి ఏడాదికి రూ.80 వేలు పాట ఖరారైంది. గతంలో కంటే ఇపుడు రూ.20వేలు తక్కువగా ఉండడంతో ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని సాంబశివరావు తెలిపారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

కోటవురట్ల : సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని తహసీల్దారు జానకమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెడుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, ఏఈ జగదీశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో వివరిస్తున్న కార్యదర్శి సుబ్రహ్మణ్యం

యలమంచిలి : గ్రామ,వార్డు సచివాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష పథకం అని తహసీల్దారు రాణీ అమ్మాజీ అన్నారు.సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వీరయ్యతో కలసి సచివాలయ సిబ్బంది, వలంటీర్లుతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



హాకీ క్రీడాకారుల సమక్షంలో రాహుల్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం నక్కపల్లిలో ఉమ్మడి విశాఖ జిల్లా అధికార ప్రతినిధి మేడేటి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ హాకీ క్లబ్‌లో హాకీ క్రీడాకారుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నిరంకుశ విధానాలను స్వస్తి పలికి రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ నిర్వాహకుడు తాతాజీ, పార్టీ నాయకులు రఘు, అశోక్, నాగేశ్వరరావు కిరణ్, చిన్ని పాల్గొన్నారు.

జేవీకే కిట్లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాయి..



కె.వెంకటాపురంలో జేవీకే కిట్లు అందజేస్తున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్



జగనన్న విద్యాకానుక కిట్లుతో విద్యార్థులు

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా అభివృద్ధి చేయడమే కాకుండా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంతో పాటు జేవీకే కిట్ల పంపిణీ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా జగనన్న విద్యా కానుక ఉందన్నారు. గతంలో సర్కారు బడి అంటే చాలా హేళనగా చూసేవారని, ఇపుడు జగనన్న విద్యా కానుక కిట్లతో విద్యార్థులు సగౌరవంగా స్కూల్‌కు వెళుతున్నారన్నారు. హెచ్‌ఎం జోష్, ఎంపీటీసీ కాళ్ల రత్నం పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

రాంబిల్లి: పంచదార్ల ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. విద్యార్థులు కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తల్లిదండ్రులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకంపై శిక్షణ


అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న సురక్ష పథకంపై సచివాలయ సిబ్బందికి సోమవారం అచ్యుతాపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధృవీకరణ పత్రాల జారీకు సంబంధించిన అంశంలో ఎదురవుతున్న సవాళ్ల గురించి ప్రత్యేక అధికారి డి.జోగనాథం అవగాహన కల్పించారు. తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రావు, 22 సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

అణుకులో సమస్యల పరిష్కారానికి చర్యలు

కోటవురట్ల : గిరిజనుల సమస్యల పట్ల సీపీఎం చిత్తశుద్ధితో పోరాటం చేస్తోందని ఆ పార్టీ మండల కన్వీనర్ జి.డేవిడ్‌రాజ్ తెలిపారు. అణుకు గిరిజన గ్రామంలో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో వైద్యాధికారులు శిరీష, సీతారామలక్ష్మి సోమవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎమ్మార్సీ సిబ్బంది సంతోష్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, డ్రాపౌట్స్‌పై పరిశీలన చేశారు. మరో 15 రోజుల్లో అణుకు ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. సీపీఎం నేత డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ తమ పోరాట ఫలితంగా వైద్య, విద్య రంగాలకు సంబంధించి కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు.

వీఆర్‌ఏల పాత్ర ఎంతో కీలకం


ఎస్.రాయవరం : గ్రామాల్లో వీఆర్‌ఏలు పాత్ర ఎంతో కీలకమని తహసీల్దార్ కె.విజయ్‌కుమార్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల వీఆర్‌ఏలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ పరమైన ఏ సమాచారం ఉన్నా వెంటనే చేరవేయాలన్నారు. వీఆర్వోలు చేసే ప్రతి పనిపై వీఆర్‌ఏలకు అవగాహన ఉండాలన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో వీఆర్‌ఏ సంఘ నాయకులు కె.లోవరాజు, చిందాడ అప్పారావు తదితరులు ఉన్నారు.



వీఆర్‌ఏలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

గ్రంథాలయానికి ప్లాంక్‌లు వితరణ

యలమంచిలి : గ్రంథాలయాలు పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని లా విద్యార్థి నడిగట్ల నరసింహం అన్నారు. యలమంచిలి పట్టణానికి చెందిన నడిగట్ల నరసింహం ఇటీవల విడుదలైన లా సెట్ ఫలితాల్లో స్టేట్ 4వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి శాఖా గ్రంథాలయంలో చదివిన పుస్తకాలే తన విజయానికి కారణం అని గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలతో పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో అవగాహన కలుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడేలా 10 ప్లాంక్‌లు గ్రంథాలయాధికారి వి.ఆనంద్‌కు సోమవారం శాఖా గ్రంథాలయంలో అందజేశారు.



ప్లాంక్‌లు అంజేస్తున్న నడిగట్ల నరసింహం

కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

మునగపాక : అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కౌలురైతు సంఘ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ మునగపాక మండలంలో 70 శాతం మంది కౌలురైతులే ఉన్నారన్నారు. వారికి గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి పథకాలు అందడం లేదన్నారు. పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అర్హులైన సాగుదారులకు అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రకాశరావుకు వినతి అందజేశారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. జల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బాబూరావుకు విద్యార్థులు అపూర్వ స్వాగతం పలికారు. పదో తగరతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జి.హేమలత, కె.శివకుమార్, జి.దివ్యలను సత్కరించి నగదు పురస్కారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిన్నారులకు బంగారు భవితను ఇవ్వడం కోసం నాడు-నేడు ద్వారా పాఠశాలలను అద్భుతంగా తయారు చేసి, విద్యలో ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా జగనన్న విద్యా కానుక కిట్లు అందించి విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపారన్నారు. జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం అందుతోందన్నారు. అమ్మ ఒడి ద్వారా అకౌంట్లలో నగదు జమ చేస్తున్నారన్నారు. ఇక మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలనే ధ్యేయంతో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా పాఠశాల స్థాయిలో రూ.3 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.15 వేలు, జిల్లా స్థాయిలో అణిముత్యాలుకు రూ.50 వేలు నగదును అందిస్తున్నారన్నారు. ఇంతలా విద్యను ఎవరైనా ప్రోత్సహించారా? అని



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రశ్నించారు. తల్లులు తమ బిడ్డల బంగారు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తమ పాఠశాలను నాడు-నేడు ద్వారా రూ.50 లక్షలతో అభివృద్ధి చేశారని, రెండో విడతలో కూడా నాలుగు తరగతి గదుల కోసం సుమారు రూ.43 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ప్రహరీ కూడా నిర్మిస్తే తమ పాఠశాల అద్భుతంగా ఉంటుందని ఇందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, రెండో వైస్ ఎంపీపీ చక్కా సుజాత, సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పేరెంట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, కిల్లాడ శ్రీనివాసరావు, పారుపల్లి శ్రీనివాసరావు, సిహెచ్.విజయ్‌కుమార్, శింగంపల్లి కిషోర్, గొల్లు చిట్టిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

కోటవురట్ల : సహచరుడి మరణాన్ని జీర్ణించుకోలేక పోయిన పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ హైస్కూల్లో 1999-2000లో పదో తరగతి చదివిన అంకంరెడ్డి నూకరాజు 2022లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులకు విషయం తెలియడంతో తమ మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. అంతా కలసి సమకూర్చిన రూ.50 వేల నగదును ఆ కుటుంబానికి అందజేసేందుకు కోటవురట్లలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్.ఎస్. సత్యనారాయణరాజు చేతుల మీదుగా మిత్రుడి కుమార్తె అంకంరెడ్డి హారికకు చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, సర్పంచ్ బి.అనిల్‌కుమార్, ఎంపీటీసీ పి.వి.సూర్యారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, దాసరి వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థి కుమార్తెకు చెక్ అందజేస్తున్న సత్యనారాయణరాజు

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజలకు మేలు

మునగపాక: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో ఈనెల 23న గడపగడపకు మన ప్రభుత్వం పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు. ఆయన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులతో పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు.ఎమ్మెల్యే రమణ మూర్తిరాజు ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారన్నారు. 23న జరిగే బహిరంగ సభకు భారీగా తరలిరావాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

ఆణిముత్యాలుతో విద్యార్థులకు ప్రోత్సాహం

ఎస్.రాయవరం : జగనన్న ఆణిముత్యాలుతో విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించడం హర్షణీయమని ఎంపీపీ కోన లోవలక్ష్మి అన్నారు. మండలంలో పలు పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. పాఠశాలల వారీగా ప్రథమ స్థానంలో వచ్చిన వారికి రూ.3వేలు, ద్వితీయ స్థానం రూ. 2వేలు, తృతీయ స్థానంలో రూ.వెయ్యి వంతున అందజేశారు. ఎస్.రాయవరం, వమ్మవరం, తిమ్మాపురం, పెదగుమ్ములూరు, పి.ధర్మవరం, ఉప్పరాపల్లి,తదితర గ్రామాల్లో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకరదేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. దార్లపూడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావు చేతుల మీదుగా ఆణిముత్యాలు నగదు విద్యార్థులకు అందజేశారు.



ఆణిముత్యాలు కార్యక్రమంలో విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

ఏకాగ్రతతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్

మునగపాక : విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని నాగులాపల్లి సర్పంచ్ జామి చినమ్మలు అన్నారు. జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా వైస్ ఎంపీపీ చింతాడ దేవితో కలిసి ఆమె సోమవారం నాగులాపల్లి హైస్కూల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు.



ఆణిముత్యాల కార్యక్రమంలో సత్కరిస్తున్న నాగులాపల్లి సర్పంచ్ చినమ్మలు, వైస్ ఎంపీపీ దేవి

సుంకపూరులో గడప గడపకు నేడు

కోటవురట్ల: సుంకపూరు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు తెలిపారు. కార్యక్రమం ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యల పాటు సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకుంటారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.